# అమ్మకోసం ఖలీల్ జీబ్రాన్‌లా తచ్చాడుతున్న సలీం

**సా**హిత్యంలో ఏ ప్రక్రియా యివ్వని ఆత్మానందాన్ని నవలలు అందిస్తాయి. డిటెక్టివ్ నవలల నించి పోస్ట్ మోడరన్ నవలల దాకా పయనించిన తెలుగు సాహిత్యంలో నవలాకారులు అందుకున్న గౌరవాన్ని యింటింటి లైబ్రరీలని అందుకున్న రచయితలలో నవలాకారులే గొప్పవాళ్ళు! వీళ్ళకి మొదటి పాఠకులు స్త్రీలు అయితే చివరి పాఠకులూ స్త్రీలే. స్త్రీల ఆదరణ పొందని నవల అది ఒక నవల కాదు. నవల శబ్దంలోనే స్త్రీ నిక్షిప్తం కాదు ప్రక్షిప్తం కూడా.

స్త్రీని గౌరవించని నవలలు యింతవరకూ ప్రపంచ సాహిత్యంలో లేవు.సాహిత్యానికి అర్థం సారాంశం, ఔన్నత్యం స్త్రీ మాత్రమే. స్త్రీలను గౌరవించని సమాజంనించి ప్రపంచం ఏనాడూ నిలదొక్కుకోలేదు.స్త్రీ-నవల-సాహిత్యప్రపంచం-యిదంతా ఓ గర్భస్థ బీజలక్షణం. ఓ తిరుగుబాటు, ఓదిద్దుబాటు. విప్లవం కంటే గొప్పది దిద్దుబాటు. రాజకీయం విప్లవాలుతెస్తే సాహిత్యం అనేకానేక దిద్దుబాట్లని తెచ్చింది. అందుకే రాజకీయ నాయకులు లెనిన్, స్టాలిన్,మావో,గాంధీ, నెహ్రూనించి, నేటి అస్తిత్వ రాజకీయ నాయకులలో శాశ్వత నాయకత్వం చిరస్మరణీయం కాలేకపోయింది! కానీ ఆయాకాలాలకి స్థగితంగా నిలబడ్డ రచయితలు విశ్వకవులుగా నిలబడి నీరాజనాలు అందుకున్నారు.

రాజకీయ నాయకుల కంటే ఏతప్పులూ చేయని సాహిత్యకారులు గొప్పవాళ్లే కాదు, గొప్ప దుఃఖితులు కూడా.! దుఃఖిత సమాజాన్ని రచయితలుగా నవలాకారులు చరిత్రని కాదు, మానవ హృదయాలని తడమటం కాదు, తమ కన్నీళ్లతో అనేకానేక మార్పులని ఆహ్వానించారు.

ఆ కోవలోకే సలీం కూడా. అతడు నాతోబాటు నడిచిన అతని బాల్యం గొప్పది.గురువుల జీవితం నించే అతని బాల్యం నేర్చుకున్న మెళుకువలే అతన్నో రచయితని చేశాయి. ఎన్నదగిన రచనలూ చేయించాయి. సలీంలో కన్పించే ఏకైక లక్షణం నవలల పట్ల అలుపు ఎరగని అవిశ్రాంత పోరాటం. నవలాకారుడిగా సలీం ఎదుగుదల, అది తెలుగు సాహిత్య నవలా వికాసంలో భాగం! అది కీర్తించదగ్గదే కాదు, ఓ మలుపు కూడా.

సలీం రచనలు స్త్రీ హృదయ స్పందనలు. దోస్టోవస్కీ, ప్రేమ్‌చంద్, శరత్, సల్మాన్ రష్దీల మాదిరి అతని స్త్రీ పాత్రలు మోసపోతాయి, ఏడుస్తాయి. క్షమించమని ప్రార్థిస్తూనే తిరుగుబాటు చేస్తాయి. కామంనించి సకామంగా పాత్రలు ఎదుగుతాయి. పురుషుడిపట్ల ప్రేమతోనే కాదు పురుషుడి ఔన్నత్యాన్నీ సలీం ఏకకాలంలో ఓ ఉన్మాదిగా చిత్రీకరించాడు. అసమర్థత ఔన్నత్యం పెనవేసుకున్న అతని మగపాత్రలు ప్రేమని నేటికాలపు రచయితల మాదిరి తగ్గించలేదు, అలా అని పెంచనూలేదు, చలం మాదిరి రహస్య గూఢచారిలా సలీం స్త్రీల పట్ల ఎంతగా రోదించాడో అతని నవలల్లో చదివి నేను దుఃఖపూరితుడ్ని అయ్యాను. క్లైమాక్స్‌లో అతని నవలల పేజీలు తిప్పడంలో నాచేతులు ఎంతో వణికిపోయాయి! నరాల బిగువుతో అతని నవలలు చరమాంకం చదవటానికి చాలా ధైర్యం కావాలి.ప్రారంభం లేదూ,ఎత్తుగడలు కొంచెం సుదీర్ఘం అన్పించినా చరమాంకం ఆ పునాదికి వున్న ప్రగాఢతకి చలించిపోతాం.

సలీం పాత్రలు ఏకకణ జీవిగా ప్రారంభమై బహుకణ జీవిలా విజృంభిస్తాయి. చాలా నవలల్లో డాక్టర్లు, వైద్యం, రోగులూ యితివృత్తంగా కన్పించటం యాధృచ్ఛికంగా అన్పించినా సలీం ఓ డాక్టర్‌గా ఈ సమాజానికి యిస్తున్న శస్త్ర చికిత్స అని అర్థం చేస్కోవాలి. అతని నవలలు ' జీవన్మృతులు. కాంచనమృగం, కాలుతున్నపూల తోటల్లో 'అంతా వైద్య వాతావరణమే

కన్పిస్తుంది. చలం స్త్రీలు ఆధునికానంతర కాలంలో సలీం స్త్రీ పాత్రలుగా ఎదిగిన సంక్షుభిత వాతావరణాన్ని పరిశీలించటం నేటి విమర్శకులకి అత్యవసర పరీక్ష. ఆ వాతావరణాన్ని తవ్వుకోటానికి ఈ వ్యాసం పూనుకోవటం ఓ సాహసమే అవుతుంది. అదో పెద్ద కాన్వాస్. అందుకు సంధర్భమూ ఆహ్వానించదు. రేపటి ఔత్సాహికులకి యిదో ఆహ్వానం మాత్రమే .

సలీం నెమ్మదిగా ఐస్ బాక్స్‌లా మనల్ని ఓ దుఃఖవాతావరణంలోకి నెట్టుకోపోతాడు. అతని నవలప్రారంభం కంటే అంతాలు చాలా గొప్పగా వుంటాయి. సలీం నవలలు ముగింపు ఎంతో గొప్పగా నరాలని పిండుతాయి. గొప్ప క్లైమాక్స్‌తో అంతమవుతాయి.

సలీం పాపులర్ స్టైల్ నించి ప్రారంభమై ఓ నిబద్ధతా రచయితగా తన నవలని ఆద్యంతం నడిపిస్తాడు. వాస్తవికత, ప్రబోధాత్మకత, వివరణాత్మకత అతని అన్ని నవలల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వాస్తవ సంఘటనలే అతని నవలలకి ఆధారం. 'వెండిమేఘం' మటుకు వదిలేస్తే అతని అన్ని నవలలు వాస్తవికతకి, వివరణాత్మకతకి దగ్గరిగా నడిచినవే. ఆదర్శ వాస్తవం నించి అతని పాత్రలు ప్రారంభమై విలువలకి కట్టుబడి వుంటాయి. చివరికంటా అతని పాత్రలు వాస్తవం నించి దూరమై ఆదర్శంగా నిలబడటానికి పౌరాణిక పాత్ర స్థాయికి తేవటాన్ని అంతగా అవసరమా అనే విమర్శ వచ్చింది, దానిమీద ఎంతో చర్చ కూడ వచ్చింది. కాంచన మృగం నవల్లోనూ ' మనో, వెంకటేశ్వర్లు ' పాత్రలు అంతే. వాస్తవికతకి పెద్ద పీట వేసే సలీం నవలల్లోని పాత్రలు ఈ పౌరాణిక పాత్రల సృష్టినించి సలీం బైటపడాలి. సలీం చేసే ఈ కిటుకులన్నీ పాఠకులు ఆమోదిస్తారు, ఆనందిస్తారు. సలీంని పాపులర్ రచయితగా నిలబెడ్తాయి. ఆ మత్తుకి నవలా రచయిత అలవాటు పడకూడదనేదే అసలు విమర్శ. కానీ సలీం లక్ష్యం అది కాదని నా నమ్మకం! అది అతనికి మాత్రమే సాధ్యమైన ఓ అద్భుతంగా చెప్పొచ్చు.

వాస్తవిక రచయితగా ఎదగటానికి చేసే కృషిలో అతని పోరాటం, ఆరాటం సామాన్యమైనదికాదు. గత ఇరవై ఏళ్లుగా యింత కసిగా సలీం మాదిరి కృషి చేసిన రచయిత నాదృష్టిలో ఎవరూ తేరు. నిర్వికల్ప సమాధిలో అతనుచేసిన రచనా వ్యాసంగం సామాన్యమైనది కాదు! మిగతా రచయితలకి లేని జీవన వైవిధ్యం సలీం చేత వాస్తవికానంతర పాపులర్ రచనలు చేయించింది. అతని రచనలు సమాజాన్ని ఎదిరిస్తానే మరే ఇతర రాజకీయ చట్రంలోకి దిగి సంకెళ్లను బిగించుకోకుండా రక్షించింది.

అతని అన్ని నవలల కంటే 'వెండిమేఘం' చాలా గొప్ప నవల. అది అతని జీవితానికి దగ్గరగా వున్న నవల కావటం మూలంగా కూడా ఎంతో ఆదరింపబడింది. నిజానికి సలీం ముస్లిం జీవితాల మీద మరెన్నో నవలలు రాయచ్చు. కథలు, కవిత్వం, నవలలు యివన్నీ సలీం ఏక సమయంలోచేసిన కృషికి తార్కాణాలు. అది అతని మేధావితనానికి తార్కాణం.

కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతికి ఎన్నికైన 'కాలుతున్న పూలతోటలో' సలీం అనుసరించిన టెక్నిక్ ఎంతో విలువైంది. ఈ ప్రబోధాత్మక నవల ' నయీ ఇమారత్‌కే ఖండహర్ 'పేరుతో శాంతసుందరి హింది అనువాదం కూడా ఎంతో పేరు తెచ్చుకుంది.

ఆయన మొదటి నవల 'జీవన్మృతులు' ఫక్తు వ్యాపారంగా సాగిన వైద్యరంగం పై ఎంతో వివరంగా చర్చించి వైద్యం వికటించిన పరిస్థితుల్లో రోగుల కొచ్చిన నష్టాన్ని ఏవిధంగా ఎదుర్కోవాలో నిరూపిస్తుంది. జయంతి పాత్రకి కొనసాగింపుగానే

నాగమణి పాత్రను ‘ కాలుతున్న పూలతోటలో ’ చూస్తాం. ఎయిడ్స్ వంచించినా పోరాడి గెల్చిన నాగమణి పాత్ర చిత్రీకరణలో సలీం నేర్పు శ్లాఘనీయం.

‘కాంచనమృగం’ నవలలో దారి తప్పిన ‘లావణ్య’ జీవిత చిత్రీకరణ ఈనాటి యువతీ యువకులకి ప్రేమ అంటే ఏమిటో సలీం ఎంతో ఓపికగా ఓ జీవిత పాఠం చెప్పటానికి ప్రయత్నించాడు.

సలీం స్త్రీ పాత్రలు ఎంతో జీవంతో తొణికిసలాడ్తాయి. స్త్రీల పట్ల సలీం తపన అర్థం చేస్కుంటే మనం నిజంగా ఎంతో దుఃఖిస్తాము. సలీంలో గొప్ప విశేషం చదివించే గుణం. అతని ఏ నవలనైనా పాఠకుడు ఏకధాటిలో చదివేస్తాడు. అక్కడే సలీం రచనా విధానంలోని నేర్పు కన్పిస్తుంది.

ఇటీవలే వెలువడిన ‘పడగనీడ ’ నవల కార్పొరేట్ విద్యాసంస్థలపై సలీం తన కలాన్ని ఎక్కుపెట్టాడు. ఆత్మస్థయిర్యాన్ని అందించేదే అసలైన చదువుగా తల్లిదండ్రులు గుర్తించాలని సలీం ఈ నవలలో తపనపడ్డాడు.

ఖలీల్ జీబ్రాన్ ప్రవక్త కావ్యం రాసిన ప్రతిసారి ఆయన తల్లి మరోసారి రాయమనేదట. అలా ఆయన అయిదుసార్లు తిరగరాసిన తర్వాత తల్లి కన్నీళ్ళతో ఆశీర్వదించటం ఓగొప్ప కావ్యానికి దారి యిచ్చింది. అలానే సలీం రచనల వెనక ఆయన తల్లి వుంది. ఆమె అడుగుజాడలే సలీం స్త్రీపాత్రలు. స్త్రీల పోరాటాలకి తన కలాన్ని అంకితం యిచ్చిన సలీం ధన్యుడు. ఆయన ఏ రచనకీ ఎవరి ముందుమాటలు లేకపోవటం ఒక విశేషం. అది సలీం ఆత్మవిశ్వాసానికి తార్కాణం.

-శ్రీరామకవచం సాగర్

98854 73934